

వీడీసీల ఇష్టారాజ్యం!

- జిల్లాలో గ్రామాభివృద్ధి కమిటీలదే హవా!
- స్థానిక ప్రజా ప్రతినిధులు లేక.. వారిదే అనధికార పాలన
- యథావిధిగా పల్లెల్లో అన్నింటికీ వేలం పాటలు
- పలుచోట్ల మళ్లీ మొదలైన వివాదాలు
- ఉన్నతాధికారుల హెచ్చరికలూ బేఖాతరు



నిర్మల్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వీడీసీ (గ్రామాభివృద్ధి కమిటీ)లది ఏకచ్ఛత్రాధిపత్యం కొనసాగుతోంది. అనధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొద్ది రోజుల క్రితమే అడిషనల్ కలెక్టర్ స్థాయి ఉన్నతాధికారి హెచ్చరించినా వీడీలు పట్టించుకోవడం లేదు. అనధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తూ తీర్పులు జారీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఇటీవల అడిషనల్ కలెక్టర్ హెచ్చరికలను బేఖాతరు చేస్తున్నారు. వీడీసీలు గ్రామాల్లో ఎలాంటి పంచాయతీలు, తీర్పులు ఇవ్వవద్దని అమాయకులను వేధింపులకు గురి చేయవద్దంటూ అడిషనల్ కలెక్టర్ ఘాటుగా హెచ్చరించారు. అయినప్పటికీ వీడీసీలు తమ ప్రవర్తనను మార్చుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వాగులోని ఇసుకకు అలాగే మద్యం, కల్లు దుకాణాలకు టెండర్లు నిర్వహిస్తూ తమ ఆధిపత్య ధోరణిని ప్రదర్శిస్తున్నాయి. ముఖ్యంగా సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిపోవడంతో వీడీసీలు మరింత రెచ్చిపోతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇలాంటి ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ వీడీసీల తప్పుడు చర్యలపై ఇక నుంచి సీరియస్‌గా వ్యవహరిస్తామంటూ జారీ చేసిన హెచ్చరికలు ఇక్కడి పల్లెల్లో కలకలం రేపాయి. వీడీసీల బాధితులు కొంత మంది కలెక్టర్‌కు తమ గోడు వెల్లబోసుకోవడంతో ఉన్నతాధికారులు ఈ దిశగా దృష్టి కేంద్రీకరించారు. ఇటీవల మామడ, నర్సాపూర్, దిలావర్‌పూర్, సారంగాపూర్, సోన్ తదితర మండలాల్లో వీడీసీల తీర్పులు, తీర్మానాలు వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. వీడీసీల చేత సామాజిక బహిష్కరణకు గురైన బాధితులు ఆందోళనలు చేపట్టి నిరసనలకు సైతం దిగిన సంఘటనలున్నాయి. అలాగే బాధితులు పోలీస్ స్టేషన్‌లలో కూడా వీడీసీలపై ఫిర్యాదు చేశారు. కాగా అధికారులు, రాజకీయ నేతలంతా వీడీసీల మెప్పు కోసం ప్రయత్నిస్తుండడం వాటికి కలిసొస్తుందంటున్నారు. నిర్మల్ జిల్లాలో వీడీసీల తీర్పులు, తీర్మానాలు ధిక్కరించే వారికి సామాజిక బహిష్కరణలతో పాటు భారీ మొత్తంలో జరిమానాలు కూడా కొనసాగుతున్నాయి.

ముగిసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీల పదవీ కాలం

సర్పంచ్‌ల పదవీ కాలపరిమితి ముగిసోవడం వీడీసీలకు మరింత ఊతమిచ్చినట్లయిందంటున్నారు. మొన్నటి వరకు కొన్ని గ్రామాల్లో వీడీసీల తీర్మానాలపై సర్పంచ్‌ల అభ్యంతరాల కారణంగా భిన్న అభిప్రాయాలు తలెత్తాయి. సర్పంచ్ అధికారికంగా కొనసాగడంతో పలు సందర్భాల్లో వీడీసీల ఆగడాలకు బ్రేక్ కూడా పడింది. ముఖ్యంగా మామడ మండలంలోని సాంగ్వి గ్రామంలో ఇలాంటి పరిస్థితి తలెత్తింది. ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిపోవడం అలాగే గ్రామాల్లోని అనధికార మద్యం, బెల్ట్ షాపులు, కూల్ డ్రింక్ షాపులు, ఇసుక క్వారీలు, కల్లు దుకాణాల నిర్వహణ గడువు కూడా ముగిసిపోవడంతో గత కొద్ది రోజుల నుంచి వీడీసీలే వీటన్నింటికీ ఏకస్వామ్యంతో టెండర్లు నిర్వహించి అనధికారిక అనుమతులు జారీ చేస్తున్నాయి.

బెల్ట్ షాపుల నుంచి ఇసుక క్వారీల వరకు

అన్ని కులాల నుంచి ఒకరు లేదా ఇద్దరేసి చొప్పున సభ్యులతో ఏర్పడుతున్న వీడీసీలు తమ గ్రామంలోని ప్రధాన ఆర్థిక వనరులను గుప్పిట్లో పెట్టుకుంటున్నాయి. ముఖ్యంగా మద్యం, బెల్ట్ షాపులకు వేలం పాటలు నిర్వహించడం అలగే వేలం పాట ఎక్కువ మొత్తం పాట పాడిన వారికి వాటిని అప్పజెప్పి అధికారికంగా నిర్వహించుకునేందుకు అనుమతులు ఇవ్వడం, గ్రామంలోని వాగులలో లభించే ఇసుకకు టెండర్లు నిర్వహించి పెద్ద మొత్తంలో డబ్బులను కూడగట్టడం లాంటివన్నీ వీడీసీల ఆధ్వర్యంలోనే కొనసాగుతున్నాయి. దీంతో పాటు గ్రామంలోని కూల్ డ్రింక్ దుకాణాలు, చికెన్ సెంటర్ల నిర్వహణలను సైతం వీడీసీలు టెండర్ ద్వారా తమకు పెద్ద మొత్తంలో చెల్లించిన వారికి అప్పజెప్పుతున్నాయి.

మాట వినకుంటే వేటు తప్పదు

గ్రామంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన సర్పంచ్‌లు అలాగే ఇతర ప్రజాప్రతినిధులను శాసించే స్థాయికి వీడీసీలు ఎదిగాయని బహిరంగ ఆరోపణలున్నాయి. వీడీసీలు విధించే శిక్షను, అవి జారీ చేసే తీర్మానాలను ధిక్కరించే వారికి సామాజిక బహిష్కరణ లాంటి కఠిన శిక్షలు కూడా అమలువుతుంటాయి. కుటుంబ తగాదాల నుంచి మొదలుకొని భూములు ఇతర వ్యాపారాల పంచాయతీలను సైతం వీడీసీలు పరిష్కరిస్తుంటాయి. ఒకవేళ వీడీసీ తీర్మానాన్ని ఎవరైనా ధిక్కరిస్తే వారితో గ్రామంలోని ఏ ఒక్కరూ కూడా మాట్లాడకుండా వారికి అనధికారిక సామాజిక బహిష్కరణ శిక్ష విధిస్తారన్న విమర్శలున్నాయి. మామూలు సందర్భాల్లోనే కాకుండా ఎన్నికల సమయంలో వీడీసీలు కీలకపాత్ర పోషిస్తున్నందున రాజకీయ నేతలు వీరికే పరోక్షంగా మద్దతు ఇస్తుంటారని వీడీసీల మాట జవదా టవద్దంటూ కూడా వీరే స్వయంగా చెబుతారని అంటున్నారు.

కల్లుడిపోలకు అక్రమ అనుమతులు

నిర్మల్ పట్టణానికి ఆనుకొని కొనసాగుతున్న ఓ కల్లు డిపో వ్యవహారం వివాదాస్పదమవుతోంది. ఎలాంటి అనుమతులు గాని లైసెన్స్ రెన్యువల్ గాని లేకుండా ఇక్కడ కొనసాగుతున్న కల్లు డిపోపై ఇటీవలే పలువురు కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదు చేశారు. డిపో నిర్వాహకులకు ఎలాంటి అనుమతులు లేకున్నప్పటికీ ఇక్కడి వీడీసీ డిపో నిర్వాహకులకు అండగా నిలుస్తున్నట్లు కలెక్టర్‌కు అందజేసిన ఫిర్యాదులో పలువురు గౌడ కులస్థులు పేర్కొనడం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. డిపో అక్రమ నిర్వహణకు వీడీసీ నిర్వాహకుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు కూడా ఆ ఫిర్యాదులు పేర్కొంటున్నారు. జిల్లా హెడ్ క్వార్టర్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో వీడీసీ సభ్యులు సంబంధిత శాఖ అధికారులను పక్కనపెట్టి కల్లు డిపో నిర్వహణకు అనధికారికంగా అనుమతులు జారీ చేశారంటే వారు అధికారుల ఆదేశాలను ఏ రకంగా బేఖాతరు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చని పలువురు వాపోతున్నారు.

ఫారెస్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ



తనిఖీ చేస్తున్న ఫారెస్ట్‌ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

నర్సాపూర్(జి), మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చాక్‌పెల్లి గ్రామపంచాయతీ పరిధిలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు సుద్ద వాగు, రిజర్వ్‌ఫారెస్ట్ నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు చాక్‌పెల్లి గ్రామానికి చెందిన సయ్యద్ కలీం ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జి డీఎఫ్‌వో నాగిని భాను ఆదేశాలతో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం చాక్‌పెల్లి గ్రామ రిజర్వ్ ఫారెస్ట్‌లో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి అనిత, హర్షద్ సెక్షన్ ఆఫీసర్, అబ్దుల్ మతిన్ బీట్‌ఆఫీసర్, సిబ్బంది అలేఖ్య, ఫాజిల్ హుస్సేన్ పాల్గొన్నారు.

తొలగించిన చోటే బుద్ధ విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముథోల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరిగాం గ్రామంలో తొలగించిన స్థలంలోనే బుద్ధ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం ముథోల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీకాంత్‌కు దళిత సంఘాల నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈనెల 12న బోరిగాంలో గల ప్రభుత్వ భూమిలో గ్రామంలోని దళితుల అంబేద్కరిస్టులు బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేసి బుద్ధ జయంతి సందర్భంగా పూజలు చేయడంతో గ్రామంలోని కొందరు దళితులపై రాళ్లతో దాడి చేసి గాయపర్చారని పేర్కొన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి దాడి చేసి గాయ పరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వారం రోజుల్లో ఎక్కడి నుంచైతే బుద్ధ విగ్రహన్ని తొలగించారో అదే స్థలంలో అధికారులు పునఃప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. లేనియెడల 26వ తేదీ నుంచి నిరాహార దీక్ష చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధమ సభ ఉత్తరతెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గడపాలే ప్రభాకర్, బుద్ధకమిటీ అధ్యక్షులు దేవదాస్ హాజ్‌డే, రాజారాం, హెచ్. ప్రకాష్ రావు, రాందాస్, సాయన్న, గంగాధర్ జాడే, నారాయణ్, దిగంబర్, రాహుల్, బింబిసార్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అండ్ బుద్ధిస్ ఐడల్ ప్రొటెక్షన్ కమిటీ నిర్మల్ జిల్లా, ది బుద్ధిస్ట్ ఆఫ్ ఇండియా, సుమత సైనిక్ దళ్, ఎంప్లాయిస్ కమిటీ, అంబేద్కర్ జన సంఘాలు, దళిత సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో ప్రజాసమస్యల పరిష్కారం

- మున్సిపల్ మాజీచైర్మన్ చిన్నం సత్యం



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్

ఖానాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలన్నింటినీ ఎమ్మెల్యే సహకారంతో పరిష్కరిస్తామని మున్సిపల్ మాజీచైర్మన్ సత్యం అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని విద్యానగర్ కాలనీలో నిర్వహించిన విద్యుత్ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరడంతో సమస్యను ఎమ్మెల్యే బొజ్జుపటేల్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఈ సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయించాలన్నారు. పట్టణంలో ఇటువంటి సమస్యలు నెలకొన్న తన దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే సహకారంతో వాటిని పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానని సత్యం తెలిపారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులున్నారు.

రైతుల భూముల జోలికొస్తే ఊరుకోం

- బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్



కలెక్టర్‌కి వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కడెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : రైతుల భూముల జోలికొస్తే ఊరుకోబోమని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ అటవీ శాఖ అధికారులను హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ రెండు, మూడు రోజుల్లో సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు. తాతల కాలం నుంచి సాగు చేసుకొని జీవనం సాగిస్తున్న రైతుల భూముల్లో అటవీ శాఖకు సంబంధించినవని ట్రెంచ్ వేయడం సరైన పద్ధతి కాదన్నారు. అటవీ శాఖ అధికారుల తీరుతో మనోవేదనకు గురవుతున్నారని ఆవేనద వ్యక్తం చేశారు. నిర్మల్ జిల్లాలోని కడెం మండలం పాండ్వాపూర్ రైతులతో కలిసి కలెక్టర్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. కలెక్టర్ సమస్యను పరిష్కరించ లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో రైతుల కుటుంబసభ్యులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, బీజేపీ నిర్మల్ జిల్లా నాయకులు ఒడిసెల అర్జున్, ఆకుల కార్తీక్, సుంకరిసాయి, శ్రావణ్, పాండ్వాపూర్, అల్లంపల్లి రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

నిర్మల్ అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన ప్రజల దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా ఆమె స్వీకరించారు. రైతు రుణమాఫీ, వైద్యం, విద్య, వ్యవసాయం, భూవివాదాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం, రేషన్‌కార్డుల మంజూరు, పింఛన్, తదితర సమస్యల పరిష్కారానికి ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. పరిష్కార వివరాలను దరఖాస్తుదారులకు అందించడంతో పాటు సంబంధిత ఫైళ్లలో స్పష్టమైన రిమార్కులు చేర్చాలని ఆదేశించారు. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రారంభించిన టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని కలెక్టర్ తెలిపారు. ఫోన్ ద్వారా వచ్చిన అర్జీలను నమోదు చేసి, వాట్సప్ ద్వారా రసీదు పంపే విధానాన్ని అమలు చేశారు. జిల్లాలో రాజీవ్ యువవికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ నెలాఖరులోగా అర్హుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని, మండల ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతుల పరిశీలన, బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడం, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల చేరిక పెంచే చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేష్ మీనా

నిర్మల్ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు సోమవారం విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలోని ఆటోడ్రైవర్ కే.సాయిప్రసాద్, సోన్ మండలంలోని గంజాల్ గ్రామానికి చెందిన పుట్ట శివకుమార్, షేక్‌ముక్తార్ మౌలాన్, నిజామాబాద్ జిల్లా కొడిచర్ల గ్రామానికి చెందిన ఉప్పు రాజ్‌కుమార్ అనే నలుగురు నిందితులు ఒక ముఠాగా ఏర్పడ్డారన్నారు. మహారాష్ట్రలోని కిన్వట్ నుంచి గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయిని తక్కువరేటుకు కొని ఎక్కువ రేటుకు నిర్మల్‌లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఆదివారం నమ్మదగిన సమాచాంం మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రాజేష్ మీనా ఆధ్వర్యంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచనలతో పట్టణ ఎస్సైనరేష్, కానిస్టేబుల్ వినయ్, అవినాష్‌లు నలుగురు నిందితులలను బైల్‌బజార్‌లో గంజాయి అమ్ముతుండగా చాకచక్యంగా పట్టుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.షర్మిల, ఏఎస్పీ రాజేష్ మీనా, పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, పట్టణ ఎస్సై నరేష్, కానిస్టేబుల్, అవినాష్‌లను అభినందించారు.

కొనుగోళ్లను వేగవంతం చేయండి



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల, మే, 19 : (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాల దృష్ట్యా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రం కుంటాలతో పాటు కల్లూరు గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు త్రాగునీరు, టెంట్ సౌకర్యం అన్ని వసతులు కల్పించాలన్నారు. అంతేగాకుండా తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం ఆయన కల్లూరు, కుంటాల బ్యాంకులలో రాజీవ్ యువ వికాసంలో దరకాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను, బ్యాంకులలో ఆన్‌లైన్‌లో క్రోడీకరిస్తున్న వివరాలను సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల సిబిల్ స్కోర్ పరిశీలన వేగవంతం చేయాలన్నారు.

డబుల్‌బెడ్ రూమ్‌లను వెంటనే అర్హులకు అందజేయాలి

నిర్మల్‌రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే పూర్తిచేసి, గ్రామంలో నిష్పక్షపాత సర్వే నిర్వహించి అర్హులైన పేదలకు అందజేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే. రాజు డిమాండ్ చేశారు. సోమవారం నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం పేదల ఇంటికలలు సాకారం చేయడానికి నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ కాకుండా మిగిలి ఉన్నాయి. మరోవైపు అనేక మంది పేదలు కిరాయి ఇళ్లలో ఉంటూ, కూలీ చేస్తూ ఇరుకు గదుల్లో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే గ్రామంలో నిష్పక్షపాత సర్వే నిర్వహించి అర్హులైన పేదలకు అందజేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరవధిక ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నర్సాపూర్ వాసులు సునీత, మల్లైక, రాణి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్ గౌడ్, మహ్మద్ ఆవేజ్



కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ పరిశీలకులు

సారంగాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్ గౌడ్, మహ్మద్ ఆవేజ్‌లు అన్నారు. సోమవారం మండలంలోని స్వర్ణ గ్రామంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోచాడి శ్రీహరిరావు అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని, పేదల కోసం పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టామన్నారు. గ్రామాలలో నాయకులు కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశం పెట్టినటువంటి పథకాలను వివరిస్తూ అర్హులైన వారందరికి అందేలా కృషి చేయాలని పేర్కొన్నారు. గతంలో రాష్ట్రాన్ని పరిపాలించిన నాయకులు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయడమే కాకుండా అభివృద్ధిని చేయడం మర్చిపోయారని పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ గ్రామాల కమిటీలను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ సన్నాహక కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్‌అది, అడెల్లి మహాపోచమ్మ ఆలయ చైర్మన్ భోజగౌడ్‌లతో పాటు నాయకులు బొల్లిజీ నర్సయ్య, రాజ్‌మహ్మద్, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రమణరెడ్డి, మారుతి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

మహిళా విభాగాన్ని బలోపేతం చేస్తాం

- జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు భవాని

నిర్మల్ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మహిళా కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషిచేస్తానని జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు భవాని అన్నారు. సోమవారం జిల్లా అధ్యక్షులు కే. శ్రీహరి రావు నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... నిర్మల్ జిల్లాలోని 396 గ్రామ పంచాయతీల్లో 90026 బూత్‌లలో కమిటీలు వేశామని, జిల్లాలోని మారుమూల గ్రామాల్లో సైతం కమిటీలు వేసి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామన్నారు. నిర్మల్, కడెం, ఖానాపూర్ తదితర మండలాల్లో బూత్ కమిటీలు పూర్తయ్యాయని త్వరలో అన్ని కమిటీలు పూర్తి చేస్తామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా మహిళా కాంగ్రెస్‌ను పటిష్ఠం చేస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అపర్ణ, కార్యదర్శి మౌనిక, జిల్లా నాయకులు సుశీల, వసంత, సంగీత, నుస్రత్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ కమిటీలు రైతు సంక్షేమం కోసం పనిచేయాలి

- డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు



ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఆత్మ కమిటీలు రైతు సంక్షేమం కోసం పనిచేయాలని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గల రైతు వేదికలో ఆత్మ కమిటీ చైర్మన్‌గా రామ్‌రెడ్డి, 27 మంది డైరెక్టర్లు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతన్నలకు ఆధునిక పద్ధతుల గురించి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆత్మకమిటీపై ఉందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రైతులకు ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బీమా, రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, మద్దతు ధరపై రూ.500ల బోనస్ వంటి పథకాలు రైతుల జీవితాలను మెరుగుపరుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జున్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి పాల్గొన్నారు.

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషి

దిలావర్‌పూర్ : సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో ప్రతీ కార్యకర్త సహకారం కోరుతున్నామని డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరి రావు అన్నారు. సోమవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలో షాదీఖానాలో నర్సా పూర్(జి), దిలావర్‌పూర్ మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్త లు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు మాట్లాడుతూ... ప్రతీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఉంద న్నారు. సమావేశంలో పీసీసీ పరిశీలకులు ఆవేజ్, చంద్రశేఖర్ గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్ రెడ్డి, కే. దేవేందర్ రెడ్డి, కోడె రాజేశ్వర్, కే.రాజారెడ్డి, మహేందర్, మనోహర్ రావు, జి. ఇంద్రకరణ్ రెడ్డి, అనిల్, ధని రవి, సప్పల రవి, కోడె నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక ఉరివేసుకుని రైతు ఆత్మహత్య

● సుందరగిరి గ్రామంలో విషాదం

● పది లక్షల రూపాయలకు పైగా అప్పు

జైనథ్, మే19 (ఆంధ్రజ్యోతి):సాత్నాల మండల పరిధిలోని ఏజెన్సీ సుందరగిరి గ్రామానికి చెందిన కొక్కుల లచ్చన్న (56) అనే రైతు అప్పులబాధ తాళలేక సోమవారం గ్రామం పొలిమెరలో గల ఒక చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుందరగిరి గ్రామస్థులు, జైనథ్ మండల పోలీసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.... మృతుడు కొక్కులలచ్చన్న తనకు ఉన్న రెండున్నర ఎకరాల భూమిలో పత్తి పంట వేశాడు. ఆశించిన దిగుబడి రాక ఉన్న పత్తి పంటకు ధర లేక తెచ్చిన అప్పులు తీరుతాయో లేదోనన్న దాని పై గత నెల రోజు లుగా మానసిక ఆందోళనకు గురవుతున్నాడని స్థానికులు తెలిపారు. దీంతో పాటు ఆయనకు ఉన్న రెండున్నర ఎకరాల భూమి పోడు భూమి కావడం, దానికి పట్టా లేక పోవడం ప్రధాన కారణమని తెలిపా రు. ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రు ణం లేక ప్రైవేట్ అప్పులు రూ.10 నుంచి 15 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. సుందరగిరి గ్రామం పొలిమెరలో గల ఒక చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు సుందరగిరి గ్రామ ప్రజలు, కుటుంబసభ్యులు తెలిపారు. మృతుని భార్య తలకొక్కుల ప్రేమల ఫిర్యాదు మేరకు జైనథ్ మం డల ట్రైనిఎస్సై రమ్య సోమ వారం మధ్యాహ్నం సంఘటన స్థలానికి చేరుకుని శవపంచనామ నిర్వహించారు. శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆదిలాబాద్ జిల్లాకేం ద్రంలోని ప్రభుత్వ రిమ్స్ ఆసుపత్రిలోని మార్చురిగదికి తరలించారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, కూతురు ఉంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జైనథ్ ట్రైని ఎస్సై రమ్య తెలిపారు.



మృతిచెందిన రైతు కొక్కుల లచ్చన్న (ఫైల్)

కాంగ్రెస్ నాయకులపై ఫిర్యాదు

ఉట్నూర్, మే19 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసినందుకు కాంగ్రెస్ నాయకులపై చర్య తీసుకో వాలని సోమవారం భారతీయ జనతా పార్టీ నాయకులు ఉట్నూర్ మం డల శాఖ ఆధ్వర్యంలో ఉట్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేయడం సిగ్గుచేటు అన్నారు. ఒక భారతదేశ ప్రధానమంత్రి దిష్టిబొమ్మ దహనం చేసే స్థాయి మీది కాదని పేర్కొంటూ ఎవరైతే నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేశారో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ ఎస్సై పూజ కు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఉట్నూ ర్ మండల అధ్యక్షులు బింగి వెంకటేశ్, జిల్లా నాయకులు కొండేరిరమేష్, సిపతి లింగాగౌడ్, భాణావత్ జితేందర్, పందిరి భీమన్న పాల్గొన్నారు.

రేషన్ కార్డుల జారీకి నిబంధనలను తొలగించాలి

బోథ్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జారీచేయనున్న రేషన్ కార్డుల విషయంలో నిబంధనలను సడలించాలని మాసం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అనిల్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన రేషన్ కార్డులదరఖాస్తుదారులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ సూరజ్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకుతెరువు కోసం కొంతమంది నిరుద్యోగులు వాహనాలను కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్నారన్నారు ప్రైవేట్ ఫైనాన్స్ అప్పులు చేసి వాహనాలు కొనుగోలు చేస్తే వారికి వాహనం ఉందంటూ రేషన్‌కార్డు జారీ విషయంలో నిబంధన పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచించి పేదలకు న్యాయం చేయాలని కోరారు.

చుక్కల దుప్పిని చంపిన 9 మంది రిమాండ్

మామడ, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిమ్మదుర్తి రేంజ్ పరిధిలో చుక్కల దుప్పిని వేటాడిన 9 మందిని అరెస్ట్ చేసి సోమవారం నిర్మల్ కోర్టులో హాజరు పరిచాక ఇద్దరికి 12 రోజుల రిమాండ్ విధించి మిగతా ఏడుగురికి పది వేల జరిమానా విధించినట్లు దిమ్మదుర్తి రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వన్యప్రాణి సంరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, అటవీ చట్టాన్ని ఉల్లంఘించినట్లయితే కేసులు తప్పవన్నారు. అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని ప్రతి ఒక్కరూ వన్య ప్రాణులతో పాటు అటవీ సంపదను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోలు అన్నపూర్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు అందుకున్న కొరెల మహేందర్

నార్నూర్ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవ తమ ఏకైక లక్ష్యం అంటు నిత్యం సామాజిక కార్యక్రమంలో నేను ఉన్న అనే భరోసా ప్రజలకు కల్పిస్తూ మంచి సేవలు అందించిన నాయకత్వాన్ని ప్రభుత్వం గుర్తించి మండల కేంద్రానికి చెందిన మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరెలా.మహేందర్‌కు సోమవారం హైదరాబాద్ లో దళిత రత్న అవార్డు మహోత్సవ కార్యక్రమంలో కంటోన్‌మెంట్ శాసస భ్యులు గణేష్ చేతుల మీదుగా అవార్డ్ ఇస్తు శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవలు గుర్తించి తనపై నమ్మ కంతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గౌరవ ప్రధాన మైన సేవ పురస్కారం వలన మరింత బాధ్యతలు పెరిగినాయి. సమాజ అభివృద్ధిలో తనవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట ఉత్సవాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఇటక రాజు, మాదిగ హక్కుల దండోర వ్యవస్థాపక అధ్య క్షులు కనక రాజు, శ్రీకాంత్ మొరే ఉన్నారు.

కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న అధికారపార్టీ

ఉట్నూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటున్న తనపై అకారణంగా అధికార పార్టీ నాయకులు ఉట్నూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయించారని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజక వర్గం ఇన్‌చార్జీ జాన్సన్ నాయక్ తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 2023 నవంబర్‌లో ఉట్నూర్ నుంచి ఖానాపూర్‌కు వస్తున్న తనని ఉట్నూర్ మండలం కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డగించే ప్రయత్నం చేసి హంగామా చేశారన్నారు. ఇప్పుడు నియోజక వర్గ వ్యాప్తంగా కలియ తిరుగుతు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సాధించిన తనకు వస్తున్న ప్రజా ఆధరణను చూసి ఓర్వలేక ఇప్పుడు కేసు నమోదు చేయించి ఉట్నూర్ పోలీసుల నుంచి నోటీసులు ఇప్పించారన్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకనే అక్రమ కేసులు

ఖానాపూర్ : నియో జకవర్గంలో తనకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని బీఆర్ఎస్ ఖానాపూర్ నియో జకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ పేర్కొ న్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తనను అడ్డుకునే ప్రయత్నం చేసిన కాంగ్రెస్ నాయకులపై తాను ఎటువంటి కేసులు నమోదు చేయకుండా జరిగిన ఘటనను చిన్న ఘటనగా భావించామన్నారు. ఆనాడు తనను అడ్డుకున్న వారే నేడు అధికారంలోకి రాగానే 16 నెలల తర్వాత అక్రమ కేసులు బనాయించడం హాస్యాస్పదమన్నారు. కక్షసాధింపులకు పాల్పడుతున్న ఎవ్వరిని వదలబోమని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

అక్రమంగా తరలిస్తున్న జొన్నల లారీ పట్టివేత



పట్టుబడ్డ జొన్నల లారీతో డీటీ జాదవ్ రామారావు

నేరడిగొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా జొన్నలు తరలిస్తున్న లారీని సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ జాదవ్ రామారావు, ఎస్ఐ శ్రీకాంత్‌లు పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ జాదవ్ రామారావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వాంకిడి గ్రామంలో అక్రమంగా 250 క్వింటాళ్ళ జొన్నలు లోడ్‌తో గల లారీని పట్టుకున్నామన్నారు. గుంటూరు నుంచి వాంకిడికి సక్రమంగా ఇలాంటి పత్రాలు లేకుండా జొన్నలను తరలిస్తున్నారని ముందస్తు సమాచారం మేరకు లారీని పట్టుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ జాదవ్ రామారావు తెలిపారు. జొన్నల విలువ రూ.8,29,250 వరకు ఉంటుందన్నారు. పట్టుకున్న లారీని నేరడిగొండ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో సీజ్ చేసి అప్పగించడం జరిగిందన్నారు. ఎవరైనా అక్రమంగా జొన్నలను తరలిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఈ దాడిలో ఇన్‌చార్జి ఎంఆర్ఐ మీరాబాయి, మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి, మార్కెట్ కమిటీ సెక్రటరీ తదితరులు ఉన్నారు.

టీబీపై అవగాహన

నేరడిగొండ, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని లఖంపూర్, గోండుగూడ గ్రామాలలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల ఆధ్వర్యంలో నిక్షయ్ శిబిర్ నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామస్తులకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. వంద రోజుల కోసం ఏర్పాటు చేసిన నిక్షయ్ శిబిర్‌లో ప్రజలకు వివిధ వ్యాధుల గురించి వివరి స్తున్నామని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంతోష్‌లు తెలిపారు.

'బకాయిల విషయమై మంత్రి దృష్టికి తీసుకెళ్తా'

బోథ్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న జొన్న పంటకు సంబంధించిన బకాయిలను త్వరలో వచ్చే విధంగా చూస్తామని మాజీ ఎంపీ సోయం బాబూరావు పేర్కొన్నారు. సోమవారం బోథ్ మార్కెట్ యార్డులో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి. రాజు యాదవ్ చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని రైతులకు వడ్డిం చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పండించిన ప్రతి గింజలు కొనుగోలు చేస్తుందని, అయితే జొన్న పంట పూర్తయ్యేంతవరకు కొనుగోలు చేపట్టడం జరుగు తుందన్నారు. అయితే జొన్న పంట విక్రయించిన రైతుల డబ్బులు ఇంత వరకు రాలేదని తమ దృష్టికి వచ్చింది అన్నారు. ఈ విషయమై రెండు రోజుల్లో సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని అన్నారు. నకిలీ పత్తి విత్తనాలు విక్రయించినట్లయితే పిడి కేసులు తప్పవని పేర్కొన్నారు. వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయించవద్దని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం నకిలీ విత్తనాల విక్రయాలపై ప్రత్యేక దృష్టి సాధించిందని అన్నారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ చైర్మన్ జి. రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జి. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలి డబ్బులు క్రాప్‌లోన్ కింద జమ

తలమడుగు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పల్సి బీ తండా. పల్సి బి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు గత పది వారాలుగా ఉపాధి హామీ పనులకు వెళ్ళగా వారు పని చేసిన దినాలకు గాను ఒక్కొక్కరికి మూడు వేల నుంచి ఆరు వేల వరకు కూలి డబ్బులు రాగా ఆ డబ్బులు మండల కేంద్రంలోని స్థానిక బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో జమ అయ్యాయి. కానీ ఆ రైతు కూలీలకు బ్యాంకులో రుణమాఫీ కాకపోవడంతో సంబంధిత రైతుల క్రాప్ లోన్ పెండింగ్‌లో ఉండడంతో వచ్చిన డబ్బులు క్రాప్ లోన్ కింద బ్యాంక్ అధికారులు జమ చేసుకోవ డంతో కూలీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై సోమవారం ఉపాధి హామీ అధికారులను కలిసి అడుగగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో అధికారులను కూలీలు కోరగా పైనుంచే జమ అయ్యాయని, మా చేతిలో ఏమీ లేదని చెప్పడంతో కూలీలు చేసేది ఏమీ లేక ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

జిల్లాలో 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఖానాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం 39.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ఆకాశం మేఘావృతమై కనిపించింది. వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ తీవ్ర ఉక్కపోత జనాలను ఉక్కిరిబిక్కిరి చేసింది. వారం రోజులుగా జిల్లాలో మిశ్రమ వాతావరణం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉదయం చల్లగా ఉంటున్న వాతావరణం మధ్యాహ్నానికి తీవ్ర ఎం డగా మారి సాయంత్రానికి ఆకాశం మేఘా వృతమై ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు కురుస్తుండడంతో వాతా వరణం ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియక జనం ఇబ్బంది పడుతున్నారు.

లక్ష్మణచాంద తహసీల్దార్‌గా సరిత

లక్ష్మణచాంద, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండల నూతన తహసీల్దార్‌గా సరిత సోమవారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నారు. ఇదివరకు ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వ హించిన జానకి కామారెడ్డికి బదిలీపై వెళ్లారు. కాగా సరిత గతంలో దిలావర్‌పూర్ తహసీల్దార్‌గా పనిచేశారు. ప్రస్తుతం కలెక్టరేట్‌లో సూపరిండెంట్‌గా విధులు నిర్వహించి లక్ష్మణచాం దకు బదిలీపై వచ్చి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. సరితను కార్యాలయ సిబ్బం దితో పాటు పలువురు నాయకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

నర్సాపూర్ తహసీల్దార్‌గా శ్రీకాంత్

నర్సాపూర్(జి), మే 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పని చేసిన సోమ శ్రీనివాస్ బదిలీపై నిజామాబాద్ వెళ్లడంతో అతని స్థానంలో తహసీల్దార్ శ్రీకాంత్ సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది పుష్పగుచ్ఛంతో ఆహ్వానం పలికారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఒకరి మృతి

నర్సాపూర్(జి), మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందన్ గ్రామానికి చెందిన సామ రూపేష్ రెడ్డి ట్రాక్టర్ బోల్తా పడటంతో అక్కడికక్కడే మరణించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నందన్ గ్రామ చెరువు నుంచి పంట పొలాల దారికి మట్టిని తీసుకుపోయే క్రమంలో చెరువు గట్టు ఎక్కుతుండగా ఒక్కసారిగా ట్రాక్టర్ రివర్స్ వెళ్లడంతో ట్రాక్టర్ బోల్తా పడి అక్కడికక్కడే మరణించాడు.

'రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందివ్వాలి'



మృతులకు నివాళులర్పిస్తున్న నాయకులు

భైంసా, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని చార్మినార్ పరిధిలో గల గుల్జార్‌హౌస్ అగ్ని ప్రమాద మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని బీఆర్ఎస్ ముథోల్ సమన్వయ కమిటీ ప్రతినిధి విలాస్ గాదేవార్ డిమాండ్ చేశారు. సోమవారం భైంసాలో పార్టీ ఆధ్వర్యంలో గుల్జార్‌భహౌస్ మృతులకు నివాళులర్పించి వారి ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా విలాస్ గాదేవార్ మాట్లాడుతూ గుల్జార్‌హౌస్‌లో చోటు చేసుకున్న ఘటన దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి అగ్ని ప్రమాద నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ పాలనలో అన్ని విధాలుగా వైఫల్యం చెందుతోందన్నారు. హోంమంత్రి బాధ్యతలు నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోనే ఉండి గుల్జార్‌హౌజ్‌లోని ప్రమాద స్థలికి వెళ్లకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం కాకుండా ఒక్కో మృతకుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందివ్వాలని డిమాండ్ చేశారు. ఇందులో భైంసా డివిజన్ పార్టీ ప్రతినిధులు డా.కపిల్, వాసే ,రసూల్, బీమేష్, ఆనంద్, మహిపాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

క్షతగాత్రులను రిమ్స్‌లో పరామర్శించిన బోథ్ ఎమ్మెల్యే



క్షతగాత్రులను పరామర్శిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): గుడిహత్నూర్ మండలం నెరడిగొండ (జి) గ్రామానికి చెందిన ప్రజలు వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా బులెరో వాహనం అదుపుతప్పి బోల్తాపడిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయా గ్రామాలకు చెందిన రోగులను ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఈ సందర్భంగా పలకరించారు. ఎలాంటి సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని ధైర్యంగా ఉండాలని అన్నారు.

హత్యాయత్నం చేసిన ఇద్దరు నిందితులకు జైలు శిక్ష

ఇచ్చోడ, మే, 19(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని బోరిగామ గ్రామానికి చెందిన బొర్రా విజయ్‌కుమార్, షేక్ మీనాజ్ షైమద్‌లకు 5సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. రెండు వేల జరిమాన విధించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే ప్రభాకర్ సోమవారం తీర్పును వెలువరించినట్లు కోర్టు లైసెన్ అధికారి జి.పండరి తెలిపారు. 2024 ఏప్రిల్ 20వ తేదీన అర్ధరాత్రి 2గంటలకు ఇద్దరు నిందితులు నర్సమ్మ ఇంటికి వచ్చి తలుపు కొట్టి లేపి ఆమెకు వచ్చిన ఉపాధి హామీ డబ్బులు ఇవ్వమని అడగగా డబ్బులు ఇవ్వనందున కత్తితో మెడను కోయడంతో నర్సమ్మ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడం గమనించడంతో ఇద్దరు అక్కడినుంచి పారిపోయారు. దీంతో నర్సమ్మ ప్రాణపాయం నుంచి బయటపడింది. అప్పటి ఎస్సై నరేష్ ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేయగా సోమవారం 10మంది సాక్షులను కోర్టు నందుహాజరుపరుచగా పిపి మధుకర్ నేరాన్ని రుజువు చేయగా నిందితులకు కఠిన కారాగార శిక్ష విధించడం జరిగింది.

ఖజానా నింపుకునేందుకే మద్యం ధరల పెంపు

● బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి

భైంసా, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇష్టారాజ్యంగా మద్యం ధరలు పెంచి వాటి అమ్మకాల ద్వారా ఖజానా నింపుకోవాలని చూస్తోందని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా.కిరణ్ కోమ్రేవార్ ఆరోపించారు. సోమవారం సంబంధిత విషయంలో పత్రిక ప్రకటనను విడుదల చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ పాలనను గాలికి వదిలి, సంక్షేమ పథకాలను హామీలకు పరిమితం చేసి ఒక్క ఎక్సైజ్ శాఖపైనే దృష్టి నిలిపిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మద్యంపై తీవ్ర రాద్ధాంతం చేసిన కాంగ్రెస్ ఇప్పుడు వాటి ధరలు పెంచి రూ. వేల కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకోవడానికి చర్యలు చేపట్టడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఇప్పటికే బీర్ల ధరలను పెంచిన ప్రభుత్వం తాజాగా లిక్కర్ ధరలను పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. సర్కార్ అసంబద్ధమైన చర్యల మూలంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్షీణిస్తుంటే సంబంధిత సమస్యను అధిగమించే చర్యల్లో భాగంగా మద్యం ధరలు పెంచడం ఎంత వరకు భావ్యమన్నారు. తెలంగాణ రైజింగ్ అంటే ఇదేనా అన్ని ప్రశ్నించారు. ఎన్నికల మెనిఫెస్టోలో పేర్కొన్న మద్యం నియంత్రణ చర్యల్లో ఇంత వరకు ఒక్క హామీనైనా అమలు పరిచారాని అని ధ్వజమెత్తారు. ప్రభుత్వం రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణగా చేసి వ్యవస్థను భ్రష్టు పట్టించేలా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. పాలన వైఫల్యానికి చిరునామగా మారుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణవాసులు రానున్న రోజుల్లో తగు రీతిలో గుణపాఠం నేర్పనున్నారని పేర్కొన్నారు.

'అహల్యభాయ్ హోల్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి'

నిర్మల్ అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : రాణి అహల్యభాయ్ హోల్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ పిలుపునిచ్చారు. సోమవారం దేవి అహల్యా భాయ్ హోల్కర్ జయంతి వేడుకను నిర్మల్ పట్టణంలోని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నిర్మల్‌జిల్లాలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొగలుల కాలంలో ధ్వంసమైన హిందూ దేవాలయాలను పరిరక్షించడంలో రాణి అహల్యభాయ్ హోల్కర్ పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. ఆమె తమ కాలంలో హిందూ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించి, హిందువులను సంఘటిత పరిచారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాం నాథ్, కార్యక్రమ జిల్లా కన్వీనర్ అలి వేలు మంగ, రాష్ట్ర నాయకురాలు ఆడే లలిత, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు వైద్య రజిని, ముథోల్ కన్వీనర్ సీరం సుష్మారెడ్డి, ఖానాపూర్ కన్వీనర్ సత్యవతి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఒడి సెల అర్జున్, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థిక సహాయం అందజేత

నిర్మల్ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : తమతో పాటు కలిసి చదువుకున్న మిత్రుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని తోటి మిత్రులు 15,500 రూపాయలు ఆర్థిక సహాయం అందించి నీకు మేమున్నామన్న భరోసా కల్పించారు. మండలంలోని భాగ్యనగర్‌కు చెందిన అల్లం రాము గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న జడ్పీఎస్ఎస్ రత్నాపూర్ కాండ్లి పాఠశాలలో పదో తరగతి చదివిన 2009-2010 బ్యాచ్ మిత్రులు రాముని కలిసి 15,500ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఆత్మ డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం



నూతన డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న సభ్యులు

లక్ష్మణచాంద, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మణచాంద గ్రామానికి చెందిన సమ్మెట రవి, వడ్యాల్ గ్రామానికి చెందిన కిరణ్ ఠాకూర్‌లు ఆత్మ (అగ్రి కల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) డైరెక్టర్లుగా సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు ఆత్మడైరెక్టర్ పదవులు రావటం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఈ పదవులు రావటానికి కృషిచేసిన డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావుకు కృతజ్ఞతలు తెలిపారు. గత కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో పార్టీ ఉన్నతికి కృషిచేసిన వ్యక్తులకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు పలువురు పేర్కొన్నారు. ప్రమాణస్వీకారం చేసిన ఆత్మచైర్మన్ రామ్‌రెడ్డితో పాటు సమ్మెట రవి, కిరణ్ ఠాకూర్‌లను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీలు ఓస రాజేశ్వర్, మేడి నారాగౌడ్, మాజీ సర్పంచ్ అబ్బడి ప్రతాప్‌రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సిరాజుద్దీన్, నాయకులు రంజిత్ రెడ్డి ఉన్నారు.

ఆగని అక్రమ దందా!

(5వ పేజీ తరువాయి...)

వాహనాన్ని వదిలేయడం ఏమటన్న? ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అసలు గుంటూరు నుంచి సిరికొండకు ఎవరి ప్రమేయంతో జొన్నల లారీ వచ్చింది. అనే కోణంలో లారీ డ్రైవర్‌తో పాటు గుంటూరు ట్రాన్స్‌పోర్టు యజమానిని విచారిస్తే అసలు బాగోతం బయటపడే అవకాశం ఉంటుంది.

చక్రం తిప్పిన ఓ ఖద్దర్ నేత

గత కొన్నేళ్లుగా రైతుల నుంచి ప్రైవేటుగా పంట దిగుబడులను కొనుగోలు చేస్తున్న ఓ నేత అక్రమ జొన్నల రవాణా విషయంలో చక్రం తిప్పినట్లు తెలుస్తుంది. తనకున్న పరిచయలు పలుకుబడితో అడ్డగోలు దందాలకు దిగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పోలీసులు పట్టుకున్న ఐచర్ వాహనం కూడా ఆ నేతకు సంబంధించిందేనని స్థానికులు చెబుతున్నారు. జొన్నల అక్రమ రవాణా కేసు నుంచి బయటపడేందుకు శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే అధికారులపై రాజకీయ పరమైన ఒత్తిళ్లను తీసుకొస్తున్న ఆ నేత తన వద్ద పని చేస్తున్న ఓ కిందిస్థాయి సిబ్బందికి అక్రమ జొన్నల వ్యాపారాన్ని అంటగట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. జొన్నల లారీ నుంచి ఐచర్‌లోకి 10, 15 జొన్న సంచులను డంపు చేసిన విషయం అధికారులకు తెలిసినా.. రాత్రికి రాత్రే ఖాళీ చేసినట్లు తెలుస్తుంది. రాంపూర్ వద్ద పట్టుబడిన అక్రమ జొన్నల లారీపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తే ఆసలు బాగోతం బయటపడే అవకాశం ఉందంటున్నారు. అలాగే స్థానికులను విచారించడంతో పాటు సీసీ కెమెరాల రికార్డులను పరిశీలిస్తే అక్రమ దందా బయటపడనుంది. అయితే అక్రమంగా తరలిస్తున్న జొన్నలను అధికారులు పట్టుకోవడం కేసులు నమోదు చేస్తూ చేతులు దులుపుకోవడంతో అసలు సూత్రధారులు తప్పించుకుంటున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఇన్‌కమ్ టాక్స్ సెంట్రల్ బోర్డు డైరెక్టర్‌కు సన్మానం



ఇన్‌కమ్ టాక్స్ డైరెక్టర్‌ను శాలువాతో సన్మానిస్తున్న దృశ్యం

సారంగాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీరవెల్లిలో గల మ్యాక్స్ సభ్యులు సోమవారం ఇన్‌కమ్ టాక్స్ సెంట్రల్ బోర్డ్ డైరెక్టర్ లక్కిడి రాజశేఖర్ రెడ్డిని బీరవెల్లి మ్యాక్స్ సభ్యులు శాలువతో సన్మానించి ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ గ్రామం నుంచి దేశ రాజధానిలో ఇన్‌కమ్ టాక్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించడంతో ఆనందంగా ఉందన్నారు. దీంతో గ్రామస్తులందరూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రవీందర్‌రెడ్డిలతో పాటు రైతులున్నారు.

బదిలీపై వెళ్తున్న జూనియర్ అసిస్టెంట్‌కు సన్మానం



సన్మానిస్తున్న అధికారులు

నర్సాపూర్(జి), మే 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ యోగేశ్వర్ రెడ్డి బదిలీపై నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ ఇరిగేషన్ ఆఫీస్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సోమ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ వాహిద్‌ఉద్దీన్, గిర్దావర్ సుమలత, సిబ్బంది, కళ్యాణి, పిర్దోస్, రవి సన్మానించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

నర్సాపూర్(జి), మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉపాధ్యాయులకు ఈనెల 20 నుంచి 24 వరకు ఐదు రోజుల పాటు శిక్షణ తరగతులు జరుగనున్నట్లు ఎంఈవో సాయన్న తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు నర్సాపూర్(జి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే తరగతులకు హాజరు కావాలన్నారు. ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలను పెంపొందించే ఈ తరగతులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సారంగాపూర్‌కు తరలిన హనుమాన్ స్వాములు

తానూర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బామ్ని గ్రామంలో 60 మంది ఆంజనేయ స్వామి దీక్ష పరులు ఆదివారంతో 41వ రోజు మండల దీక్ష పూర్తి కావడంతో సోమవారం రోజు గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడిని కట్టుకొని నిజామాబాద్ జిల్లాలో గల సారంగాపూర్ హనుమాన్ ఆలయానికి బయలు దేరారు. ముందుగా గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెట్లను ఏర్పాటు చేసి పూలతో అందంగా అలంకరించి, భక్తి గేయాలను ఆలపించారు. స్వాముల ఆంజనేయుని నామస్మరణతో గ్రామం మారుమ్రోగింది.

ఆఖరి రోజు దరఖాస్తుల వెల్లువ



కుంటాలలో రెవెన్యూ సిబ్బందికి దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

కుంటాల, మే, 19 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలం భూ భారతి పైలట్ ప్రాజెక్టులో ఎన్నికైన సందర్భంగా గత 15 రోజుల నుంచి రైతులకు సంబంధించిన పలు రకాల భూ సమస్యల దరఖాస్తులు స్వీకరించిన అధికారులు సోమవారం ఆఖరి రోజు కావడంతో అధిక సంఖ్యలో రైతులు వచ్చి దరఖాస్తులు అందజేశారు. దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించనున్నట్టు రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

భూమి కొలతలు చేపట్టాలి

నర్సాపూర్(జి), మే 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కండెల లక్ష్మీ చాక్‌పల్లి గ్రామ శివారులో తన సొంత భూమిని కొలతలు చేపట్టాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గతంలో చలానా కడితే భూమి కొలతలు చేయలేదని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సోమ శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

నర్సాపూర్(జి), మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఇరగదండ్ల ఎల్లన్న (50) అనే వ్యక్తి ఈ నెల 17వ తేదీన సాయంత్రం సమయంలో మద్యం తాగడానికి ఇంట్లో ఉన్న తన కూతురికి చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోయేసరికి తన కుటుంబసభ్యులు కల్లూర్ గ్రామానికి వెళ్లి ఉండవచ్చని అనుకున్నారు. కానీ సోమవారం ఉదయం రాంపూర్ గ్రామ శివారులోని ఎర్రకుంట చెరువులో ఒక వ్యక్తి మరణించి ఉన్నాడని గ్రామస్తులు తెలిపారు. వెంటనే కుటుంబసభ్యులు అనుమానంతో ఆ చెరువు వద్దకు వెళ్లి చూడగా ఎల్లన్న మరణించి ఉన్నాడు. మృతుడి కూతురు తిరుమల ఎల్లన్న మృతదేహాన్ని గుర్తించింది. సోమవారం నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌లో మృతుడి కూతురు ఫిర్యాదు చేయగా ఏఎస్సై శంకర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



సమావేశంలో పాల్గొన్న ఆయా శాఖల అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

చదువు మానేసిన వారిని గుర్తించాలి

● ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్అర్బన్, మే19 (ఆంధ్రజ్యోతి):ఓపెన్ స్కూల్, ఉల్లాస్‌పై సర్వే నిర్వహించి చదువు మానేసిన వారిని గుర్తించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ 8, 9 తరగతులు మానేసిన వారు పై తరగతిలోకి వెళ్లేందుకు వారిని గుర్తించి, ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. వయస్సు నిమిత్తం లేకుండా లర్నర్స్‌ను గుర్తించి జిల్లాలో ఎంత మంది ఉన్నారో వారి వివరాలు సేకరించి ఉల్లాస్‌యాప్‌లో వాలంటీర్లు నమోదు చేయాలన్నారు. ప్రతి రోజు 25 ఇళ్లు సర్వే చేయాలని, మే చివరి వారం వరకు సర్వే పూర్తి చేసి లర్నర్స్ గుర్తించి రిపోర్టు సమర్పించాలని సూచించారు. సెర్ప్, మెప్మా, డీడబ్ల్యుఓ డిపార్ట్‌మెంట్‌లకి ఈ నెల 20న శిక్షణ కార్యక్రమాన్ని అడల్ట్ ఎడ్యుకేషన్ ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే బడి మానివేసి హోటల్స్, రెస్టారెంట్లలో, డాబాల్లో పనిచేస్తున్న పిల్లలను గుర్తించాలని వారి వివరాలను సేకరించాలని లేబర్ అధికారిని ఆదేశించారు. అలాగే గుర్తించిన పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. పదవ తరగతిలో ఫెయిల్ అయినా విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి సారించి ఆన్‌లైన్ తరగతులు, అభ్యాస దీపికలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం ఆరోగ్య పాఠశాల, నార్నూర్, ఇంగ్లీష్ ఫౌండేషన్ లెర్నింగ్, ఎస్ఎస్‌సీ, ఇంటర్ అడ్మిషన్‌పై సమీక్షించారు. ఇందులో విద్య, వైద్యం, డీఈఓ, డీఐఈఓ, డీడబ్ల్యుఓ, మున్సిపల్ కమిషనర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెడు మార్గం వీడి మంచి మార్గంలో నడవాలి

● ఎమ్మెల్యే పాయల శంకర్

● క్యాంపు కార్యాలయంలో హనుమాన్ దీక్షాదారులకు భిక్ష



హనుమాన్ విగ్రహానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): అనాధిగా వస్తున్న సనాతన హిందూ ధర్మ ప్రాశస్త్యాన్ని తెలియజేసేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హనుమాన్ దీక్షాదారులకు భిక్ష ఏర్పాటు చేసి దీక్షదారులకు ఎమ్మెల్యే స్వయంగా భోజనం వడ్డించారు. ఈ బిక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయలశంకర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం శ్రీసీతారామ సహిత ఆంజనేయ స్వామి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ చెడు అలవాట్లను వీడి మంచి మ్మార్గంలో నడవడంతో పాటు జీవితంలో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఇందులో హనుమాన్ దీక్షాదారులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

గోమాతల రక్షణార్థం సంకల్ప సైకిల్ యాత్ర



మాట్లాడుతున్న అగస్త్య స్వామీజీ

ఇంద్రవెల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): అగస్త్య స్వామి కామ దేనువు గో సంరక్షణ గోశాల ఆధ్వర్యంలో జగిత్యాల నుంచి కేదరీనాథ్ వరకు వేల గోమాతల రక్షణార్థం సంకల్ప సైకిల్ యాత్ర ఇంద్రవెల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా అగస్త్య స్వా మిజీ మాట్లాడుతూ గోవులను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని, గో వ్యవసాయ ఆధారిత పంటలు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగం, మండల ఉపాధ్యక్షుడు ముండే రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో మేలు

● భూమిలో వేడి చల్లారిన తర్వాతే విత్తనాలు విత్తాలి



ఇచ్చోడ పరిధిలోని వ్యవసాయ భూమిలో లోతుగా దుక్కి చేసిన దృశ్యం

ఇచ్చోడ, మే 19 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం పంటల సాగుకు వేసవిలోనే దుక్కులు దున్నితే ప్రయోజనకరంగా ఉంటుంది. ఎక్కువ మంది రైతులు రబీ పంటల కోతలు పూర్తి కాగానే పొలాన్ని అలాగే వదిలేస్తారు. ఖరీఫ్‌లో ఒక వర్షం పడగానే సాగుకు సిద్ధమవుతారు. వేసవిలో దుక్కులు దున్ని భూమిలో వేడి చల్లారిన తర్వాత విత్తనాలు విత్తితే ఆశించిన ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయాధికారులు అంటున్నారు.

లోతుగా దున్నితే ప్రయోజనాలు అధికం

మే, జూన్ నెలల్లో కురిసే వర్షం జల్లులకు లోతుగా దుక్కులు దున్నడం వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకి నాటిన విత్తనం ఏపుగా పెరిగి అధిక దిగుబడలు సాధించడానికి దోహదపడుతుంది. దీంతో కలుపు బెడదచాలా వరకు తగ్గించవచ్చు. దుక్కి సిద్ధం చేసుకోకుంటే కలుపు బాగా పెరిగి పోషక పదార్థాలను గ్రహించి భూసారాన్ని తగ్గిస్థాయి. కొన్నేళ్ల క్రితం వరకు ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే నాటికి పలు దఫాలుగా దున్నుతుండేవారు. ఆ తర్వాత సాగుపై అవగాహన కల్పించే వారు లేక రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. నైరుతి రుతుపవనాలు రాగానే దుక్కులు సిద్ధం చేసి వితనాలు నాటుతున్నారు. దీంతో మొలక శాతం తగ్గి విత్తనాలు సరిగ్గా మొలకెత్తడం లేదు.

రైతులు అవగాహన పెంచుకోవాలి..

● ఏఈవో సంజీవ్‌నాయక్

రైతులు పంటల సాగుపై అవగాహన పెం చుకోవాలి. భూమి వేడి నుంచి చల్లారాక విత్తనాలు విత్తుకోవాలి. ఒక వర్షం పడగానే విత్తనాలు వేస్తే మొలకశాతం తగ్గుతుంది. వేసవిలో లోతుగా దుక్కి దున్నుకోవడంతో పాత తరం అన్నదాతలకు అవవగాహన ఉం ది. నేటి తరం రైతన్నలు పాత తరం వారి సూచనలు సలహాలు తీసుకుని ముందుకేళ్లాలి.



చెట్లకు పెట్టిన ప్రచార బోర్డులను తొలగిస్తున్న అటవీశాఖ సిబ్బంది

చెట్టుకు నష్టం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

బోథ్, మే 19 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న చెట్లకు నష్టం కలిగించే విధంగా వివిధ రకాల కంపెనీల వారు తమ తమ ప్రచార బోర్డులను ఏర్పాటు చేస్తున్నారని ఈ విధంగా చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని అటవీ శాఖ అధికారి ప్రణయ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలో రోడ్ల పక్కన పెరుగుతున్న చెట్లకు మొలలు కొట్టి ఏర్పాటుచేసిన బోర్డులను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరుగుతున్న చెట్లకు వివిధ కంపెనీలు తమ ఉత్పత్తులను వివరించే విధంగా బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఫలితంగా చెట్ల పెరుగుదల ఆగడంతో పాటు చెట్లు ఎండిపోయే ఆస్కారం ఉందని పేర్కొన్నారు. కంపెనీల వారు ఈ విధమైన బోర్డులు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా మండలంలోని రోడ్ల పక్కన ఉన్న చెట్లకు బోర్డులను తొలగించడం జరిగింది.



అటవీ శాఖ వారు స్వాధీనం చేసుకున్న వివిధ కంపెనీల ప్రచార బోర్డులు

అవగాహన లోపం.. గిరిజనుల భూములకు శాపం

● తరలిపోతున్న సేంద్రీయ ఎరువు

ఉట్నూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): తమ దగ్గర నిల్వ ఉన్న సేంద్రీయ ఎరువులను అమ్ముకుంటున్న గిరిజనులు తమ వ్యవసాయ భూముల్లో రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు విరివిగా వాడుతుండడంతో గిరిజనుల భూములకు శాపంగా మారుతుంది. సేంద్రీయ ఎరువుల వాడకం పై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు ఎంత అవగాహన కల్పిస్తున్న ఏజెన్సీలోని గిరిజనులు మాత్రం తమ వద్ద ఉన్న పశువుల పేడ (సేంద్రీయ ఎరువులు)ను పంటల్లో ఉపయోగించుకోకుండా అమ్ముకుంటున్నారు. ఉట్నూర్ మండలంలోని బీర్సాయిపేట, రాంనగర్, దంతనపల్లి, గన్‌పూర్, చెరువుగూడెం, కొత్తగూడెం, నర్సాపూర్, లక్కేటిపేట, సాలెవాడ తదితర ప్రాంతాలకు చెందిన గిరిజనులు ఒక లారీ పశువుల పేడ లోడును కేవలం పది వేల రూపాయలకి విక్రయిస్తున్నారు. ఒక లారీ పశువుల పేడ పది ఎకరాలకు ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన రైతు మింగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా షాంపూర్, దంతనపల్లి, రైతు వేదికల్లో నిర్వహించిన కార్యక్రమాలలో రైతాంగం యూరియాను ముఖ్యమైన ఎరువుగా వాడడం వల్ల పంటలకు నత్రజని అందించి దిగుబడిని పెంచడానికి ఉపయోగపడుతుందని, కానీ యూరియాను ఎక్కువగా వాడడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడం, పర్యావరణ కాలుష్యం, పంటకాలం పెరగడం, చీడపీడల ఉధృతి పెరగడంతో పాటు రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా పెరుగుతాయని అవగాహన కల్పిస్తున్నారు. సేంద్రీయ ఎరువు అయినా పశువుల ఎరువు, కంపోస్టు వంటి సేంద్రీయ ఎరువులు పంటలకు అనువైన జీవన ఎరువులని వీటి వాడకం వల్ల నేలసారం పెరుగుతుందని పేర్కొంటున్నారు.

● సేంద్రీయ ఎరువు అమ్మకాలను నిషేదించాలి

ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన రైతులు తమ వద్ద ఉన్న సేంద్రీయ ఎరువును వాడకుండా అధిక డబ్బులు చెల్లిస్తూ రసాయన ఎరువులు వాడుతూ ఆర్థిక ఇబ్బందులు కొనితెచ్చుకుంటున్నారు. గతంలో ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులతో పాటు, సబ్ కలెక్టర్‌లు ఏజెన్సీ ప్రాంతం నుంచి సేంద్రీయ ఎరువు తరలిపోకుండా ఉండడానికి సేంద్రీయ ఎరువుల అమ్మకాన్ని నిషేదించారు. దశాబ్దం కాలం క్రితం వరకు ఏజెన్సీ ప్రాంతంలోని సేంద్రీయ ఎరువులు బయటి ప్రాంతానికి వెళ్లక పోవడంతో గిరిజన రైతులు తమ పంట పొలాల్లో సేంద్రీయ ఎరువులు వాడేవారు. అధికార యంత్రాంగం సైతం ఏ మాత్రం పట్టించుకోక పోవడంతో గిరిజన ప్రాంతాల రైతులు తమ సేంద్రీయ ఎరువులను విచ్చలవిడిగా అమ్ముకుంటున్నారు. ఈ ప్రాంతంలోని గిరిజన రైతుల అమాయ కత్వాన్ని ఆసరా చేసుకుని దళారులు లారీలను తెచ్చి ఏజెన్సీ ప్రాంతంలోని సేంద్రీయ ఎరువులను నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, వరంగల్ ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఏజెన్సీ నుంచి సేంద్రీయ ఎరువులు తరలిపోకుండా ఉండడానికి సేంద్రీయ ఎరువుల అమ్మకంపై నిషేదం విధించాలని పరిశీలకులు కోరుతున్నారు.



ఉట్నూర్ ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్న సేంద్రీయ ఎరువు



బీర్సాయిపేట రామ్‌నగర్ వద్ద గిరిజనుల సేంద్రీయ ఎరువును లారీలో ఎక్కిస్తున్న కూలీలు

నేటితో ముగియనున్న వేసవి కాల శిబిరాలు





కౌటా(బి) గ్రామంలోని ఉన్నత పాఠశాలలో యోగ ఆసనాలు వేస్తున్న విద్యార్థులు



వివిధ రకాల ఆసనాలను నేర్చుకుంటున్న విద్యార్థులు

● విద్యార్థుల్లో యోగ పై ఆసక్తి

బోథ్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వేస వికాలంలో విద్యార్థులు ఇంటి వద్ద ఉండి విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దన్న దృక్పథంతో ఏర్పాటు చేసిన వేసవికాలం శిబిరాలు సత్ఫలి తాలను ఇస్తున్నాయి. మండలంలోని కౌటా(బి) గ్రామంలో ఉన్న ఉన్నత పాఠశాలలో వేసవికాలం శిబిరాన్ని నిర్వహిం చారు.

● పలు అంశాలపై శిక్షణ

వేసవికాలం నిర్వహించిన శిక్షణ శిబిరాల్లో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. యోగ ఆసనాలతో పాటు చిత్రలేఖనం డ్యాన్స్‌పైన విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అయితే ప్రభుత్వం వేసవి కాలం శిబిరాల్లో తక్కువ సమయంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేవిదంగా అనుభవజ్ఞులైన వలంటీర్ల చే శిక్షణ ఇప్పించడంతో విద్యార్థులు ఆసక్తి కనబరిచి నేర్చుకున్నారు. వేసవి శిబిరాలు విద్యార్థులకు ఉపయోగపడ్డాయి.

● విద్యార్థుల ఆసక్తి

వేసవి శిబిరాలలో విద్యార్థులు యోగా డ్యాన్సింగ్ పైన ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారని శిక్షణ ఇస్తున్న ట్రైనర్లు పేర్కొన్నారు. స్వల్ప కాలంలో విద్యార్థులు ఆసనాలతో పాటు డ్యాన్సులు నేర్చుకోవడం జరిగిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు నేర్చుకుంటే మరింత పట్టుదలతో ముందుకు వెళతారని పేర్కొన్నారు.

● అవకాశం ఉంటే నేర్పుతాం

తమకు అవకాశం కల్పిస్తే భవిష్యత్తులో విద్యార్థులకు వివిధ రకాల శిక్షణను ఉచితంగా అంది స్తామని ట్రైనర్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఆసక్తిని గమనిస్తే తమకు మరిన్ని రోజులు బోధన సాగించాలని ఉందన్నారు. ప్రభు త్వం సెలవు దినాలలో ఈ విధమైన తరగతులను నిర్వహించాలని వారు కోరారు. విద్యార్థులు తల్లిదండ్రులు సైతం విద్యార్థులు నేర్చుకున్న వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తపరుస్తున్నారు.

నేడు భైంసాలో తిరంగా యాత్ర

● అన్ని వర్గాలు పాల్గొనాలని కుల సంఘాల పిలుపు ● లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి యాత్ర ప్రారంభం

భైంసా, మే 19 (ఆంధ్రజ్యోతి): అపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకొని త్రివిధ దళాలల సైనికులకు సంఘీభావంగా మంగళవారం రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో తిరంగా యాత్ర జరుగనుంది. ఉదయం 10 గంటలకు స్థానిక పద్మావతీ కాలనీ పరిధిలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమ్యే తిరంగా యాత్ర మున్సిపల్ కార్యాలయం, గాంధీ గంజ్, ప్రధాన రోడ్డు మార్గం మీదుగా బస్టాండ్ ఎదుట గల బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరక కొనసాగనుంది. దేశ రక్షణలో అహర్నిషలు నిమగ్నమైన సైనికులకు సంఘీభావం తెలుపడంతో పాటు జాతీయ జెండా గౌరవాన్ని ఇనుమడింప చేసేలా యాత్ర నిర్వాహణకు ఏర్పాటు జరిగాయి. దేశ సమైక్యత, సౌభ్రాతృత్వం ప్రతిబింబించేలా తిరంగా యాత్ర కొనసాగనుంది.



ప్రదర్శనలు నిర్వహిస్తున్న కుల సంఘాల ప్రతినిధులు

● అన్ని వర్గాలు పాల్గొని విజయవంతం చేయాలి

పట్టణ పరిధిలోని అన్ని వర్గాలు తిరంగా యాత్రలో పాల్గొని సమైక్యత, సౌభ్రాతృత్వాన్ని చాటుకోవాలని భైంసా పట్టణ పరిధిలోని కుల సంఘాలు పిలుపునిచ్చాయి. సోమవారం సాయంత్రం స్థానిక లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్ సారధ్యంలో కుల సంఘాల ప్రతినిధులు బేటి జరిపి తిరంగా యాత్ర వివరాలను వెల్లడించారు. కుల,మత, రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న తిరంగా యాత్రలో అన్ని కులాల, మతాల, రాజకీయ పార్టీల శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇదే క్రమంలో యాత్ర కొనసాగే సమయంలో వ్యాపార, వర్తక, వాణిజ్య సంఘాలు తమ తమ దుకాణాలను మూసి వేసి సిబ్బందితో సహా తిరంగా యాత్రలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కుల సంఘాల ప్రతినిధులు త్రివిధ దళాల సైనికులకు సంఘీబావంగా ప్రదర్శనలు చేపట్టారు. అమరవీరులకు నివాళులర్పించి వారి ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు నిముషాలు మౌనం పాటించారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.8 ; కనిష్ఠం 29.2
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
మంగళవారం 20 మే 2025




ఆగని.. అక్రమ దందా!





- జిల్లాలో వరుసగా పట్టుబడుతున్న జొన్న పంట దిగుబడులు
- ఇతర రాష్ట్రాల నుంచి భారీగా కొనుగోలు కేంద్రాలకు తరలింపు
- తాజాగా సిరికొండ మండలంలో 350 క్వింటాళ్ల జొన్నలు సీజ్
- మరో ఐచర్ వాహనం పట్టుకొని వదిలేయడంపై అనుమానాలు
- జొన్నల అక్రమ వ్యాపారంలో ఓ మండల స్థాయి నేత హస్తం
- కేసులు నమోదు చేస్తూ.. చేతులు దులుపుకుంటున్న అధికారులు



ఆదిలాబాద్, మే 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జొన్నల అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట పడడం లేదు. కొందరు వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా కొనుగోలు కేంద్రాలకు తరలిస్తూ అమ్మేసుకుంటున్నారు. గడిచిన పక్షం రోజుల్లోనే వెయ్యి క్వింటాళ్లకు పైగా జొన్నలను అధికారులు పట్టుకున్నారు. నిత్యం జిల్లాలో ఎక్కడో ఒకచోట జొన్నల బాగోతం బయట పడుతునే ఉంది. ఇటీవల ఇంద్రవెల్లి, తాంసి, తలమడుగు, బోథ్, ఇచ్చోడ మండలాల్లో అధికారులు జొన్నలను పట్టుకొని సీజ్ చేశారు. దీనిని మరిచిపోక ముందే సోమవారం ఉదయం 3గంటల ప్రాంతంలో సిరికొండ మండలం రాంపూర్ గ్రామంలో అక్రమంగా జొన్నలను డంప్ చేస్తున్న లారీనీ పోలీసులు పట్టుకోవడం చర్చనీ యాంశంగా మారింది. మరో పది రోజుల్లో జొన్న కొనుగోళ్లు ముగిసిపోయే అవకాశం ఉంది. దీంతో కొనుగోలు కేంద్రాలకు జొన్నలను తరలిస్తూ అమ్మేసుకునేందుకు ఎగబడుతున్నారు.



తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న జొన్నల లారీతో పోలీసులు

ముఖ్యంగా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి జిల్లాకు భారీగా జొన్నలను తరలిస్తున్నట్లు తెలుస్తుంది. కొంతమంది అధికారులు, రాజకీయ నేతల అండదండతోనే దళారులు అక్రమ దందాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ధరల్లో భారీ తేడా

ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే మన వద్ద జొన్న పంట ధరల్లో భారీ తేడాలు కనిపిస్తున్నాయి. దీంతో వ్యాపారులు సొమ్ము చేసుకునేందుకు అడ్డదారిలో అక్రమ దందాలకు ఎగబడుతున్నారు. రైతుల పేరిట కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. మహారాష్ట్రలో క్వింటాల్ జొన్నలు రూ.2200 వరకు ధర పలుకుతుంది. అవే జొన్నలను జిల్లాకు తరలిస్తూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రూ.3371 మద్దతు ధరకు విక్రయిస్తున్నారు. ఇలా ఒక్కో క్వింటాల్‌కు రూ.వెయ్యిన ఉంచి రూ.1200 వరకు లాభాలను జేబులో వేసుకుంటున్నారు. నిత్యం వందల క్వింటాళ్లను విక్రయిస్తూ లక్షల రూపాయలను సంపాదిస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా.. తెలియనట్లుగానే వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్నాళ్లు మహారాష్ట్ర నుంచి జిల్లాకు జొన్నలను తరలించిన వ్యాపారులు సరిహద్దుల్లో నిఘా పెంచడంతో ఆంధ్రప్రదేశ్, తదితర రాష్ట్రాల నుంచి జొన్నలను తీసుకొస్తూ జిల్లా మార్కెట్‌లో అమ్మేసుకుంటున్నారు. తాజాగా సిరికొండ మండలంలో పట్టుబడిన జొన్నలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు నుంచి జిల్లాకు తరలించినట్లు పోలీసుల విచారణలో తేలింది.

వాహనం ఎందుకు వదిలేసినట్లో?

సిరికొండ మండలం రాంపూర్ గ్రామంలో పట్టుబడిన జొన్నల లారీతో పాటు పోలీసులు మరో ఐచర్ వాహనాన్ని పోలీసు స్టేషన్‌కి తరలించారు. గుంటూరు నుంచి సిరికొండకు లారీలో జొన్నలను తీసుకువచ్చిన వ్యాపారి గుట్టుచప్పుడు కాకుండా రాత్రి 3గంటల సమయంలో మరో ఐచర్ వాహనంలోకి జొన్న సంచులను డంపు చేస్తుండగా స్థానికులు సమాచా రం ఇచ్చారు. దీంతో పోలీసులు లారీతో పాటు ఐచర్ వాహనాన్ని పట్టుకున్నారు. అయితే రాత్రి నుంచి ఉదయం వరకు పోలీసు స్టేషన్‌లోనే ఐచర్ వాహనాన్ని ఉంచి ఆ తర్వాత వదిలేయడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమంగా తరలించిన జొన్నలతో ఐచర్ యజమానికి ఎలాంటి సంబంధం లేకపోతే జొన్నల సంచులను ఐచర్ వాహనంలోకి ఎందుకు డంపు చేశారో? అధికారులకే తెలియాలి మరి. రాత్రంతా బతిమలాడినా వదిలేయని అధికారులు.. ఉదయం ఓ నియోజకవర్గ స్థాయి నేత ఆదేశాలతో హుటాహుటిన ఐచర్

(తరువాయి 6వ పేజీలో...)



అర్జీదారుల సమస్యలను వింటున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్

ఆదిలాబాద్‌అర్బన్, మే19 (ఆంధ్రజ్యోతి):ప్రజా ఫిర్యాదుల విభాగంలో అర్జిదారులు సమర్పించిన ఫిర్యాదులను అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రతీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగంలో వివిధ మండలాల నుంచి వచ్చిన దరఖాస్తుదారులు తమ ఫిర్యాదులను సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సీఎం ప్రజావాణి, ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్జిదారుని దరఖాస్తును క్షుణంగా పరిశీలించి అర్జీకి సంబంధించిన సమస్య వివరాలను క్లుప్తంగా అర్థమయ్యేలా వారికి వివరించాలని తెలిపారు. కాగా సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగంలో 104 అర్జీలు వివిధ శాఖలకు సంబంధించి వచ్చాయన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ వినోద్‌కుమార్, జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గిరిజనుల సమస్యలను వింటున్న ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా

గిరిజన సమస్యలకు సత్వర పరిష్కారం

- గిరిజన దర్బార్‌లో ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా

ఉట్నూర్, మే 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. ఉట్నూర్ మండలం మర్కగూడ గ్రామానికి చెందిన మధు తమ గ్రామానికి సోలార్ విద్యుత్ సౌకర్యం కొరకు, తలమడుగు మండలం ఝరి గ్రామానికి చెందిన గేడం శంకర్ తనకు బోర్‌వెల్ మంజూరు కల్పించమని, ఆదిలాబాద్ మండలం ఖండల గ్రామానికి చెందిన శ్రీదేవి తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించమని కోరారు. పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ గిరిజన దర్బార్‌లో 25 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ(పీవీటీజీ) మేస్రం మనోహర్, ఏఓ దామోదర స్వామి, ఈఈ తానాజీ, మేనేజర్ శ్యామల డీపీఓ ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవోదయ విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం ఒక్కటైన మండల వాసులు

- గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కి విజ్ఞాపన

బీంపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నవోదయ విద్యాలయం ఏర్పాటు కోసం మండలంలోని అన్ని పార్టీల నాయకులు అఖిల పక్షంగా ఏర్పడ్డారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షాను సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల విభాగంలో వినతిపత్రం ఇచ్చారు. ఆదివాసీలు ఎక్కువగా ఉన్న బీంపూర్ మండలం అన్ని రంగాలలో వెనకబడి ఉన్నదని, నవోదయ విద్యాలయం ఏర్పాటు అయితే పిల్లల భవిష్యతు బాగుపడుతుందని నాయకులు కలెక్టర్‌కి విన్నవించారు. కొత్త మండలంగా ఉన్న బీంపూర్‌లో విద్యాలయం ఏర్పాటు కోసం అవసరమైన స్థలం సహా ఇతర సౌకర్యాలు ఉన్నాయని నాయకులు వివరించారు. నవోదయ విద్యాలయం ఏర్పాటు విషయంలో అన్ని కోణాలలో ఆలోచించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, వెనకబడిన మండల బీంపూర్‌లో జీవన ఉపాధిల కోసం చిన్న పరిశ్రమల ఏర్పాటు పరిశీలిస్తామన్నారు. నవోదయ విషయంలో పరిశీలన చేస్తామని కలెక్టర్ అన్నారు. ఇందులో మాజీ జడ్పీటీసీ కురా సుధాకర్, మాజీ ఎంపీపీ కుడి మేత సంతోష్, నాయకులు మేకల నాగయ్య, అంకం అశోక్, మాడావి లింబాజి, సవాయి స్వామి, గుర్ల నారాయణ, బక్కి కపిల్, షేక్ అఫ్రోజ్, బొంత నితిన్, మేకల ప్రవీణ్, మాడావి వినోద్, మల్లెల స్వామి, జైపాల్, తదితరున్నారు



బాధ్యతలను స్వీకరిస్తున్న గంగా సింగ్ రాథోడ్

నార్నూర్ ఎంపీడీవోగా గంగా సింగ్ బాధ్యతల స్వీకరణ

నార్నూర్ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : నార్నూర్ ఎంపీడీవోగా గంగా సింగ్ రాథోడ్ సోమవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాల్సన్నారు. వాటిని సాధ్యమైనంత వరకు పరిష్కరించే దిశగా సహకారం చేస్తామన్నారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన జవహర్ జిల్లా పరిషత్ ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. ఇందులో ఎంపీవో సాయి ప్రసాద్, ఏపీఓ సురేందర్, అర్జున్, అధికారులున్నారు.

ఇంటర్‌లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలి : అంబాజీ

ఉట్నూర్, మే 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పదవ తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు 400 మార్కులు కలిగిన వారు కార్పొరేట్ కళాశాలలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31లోగా మీ సేవ ద్వారా ఆన్‌లైన్‌లో గిరిజన విద్యార్థులు ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, మొబైల్ నెంబర్, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, తదితర అన్ని సర్టిఫికెట్లతో రాష్ట్రంలోని గిరిజన విద్యార్థులు మాత్రమే దరఖాస్తులు సమర్పించుకోవాలన్నారు.

ఏజెన్సీ ఎస్సీలకు పహనీలు ఇవ్వండి : నిరంజన్

నార్నూర్ రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): గిరిజన ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటూ భూములు సాగు చేస్తున్న ఎస్సీ రైతులు ను ప్రభుత్వం పాహనిలు ఇచ్చి వారిని ఆదుకోవాలి ఆదివాసీ పురోహిత్ ప్రధాన సంఘం అధ్యక్షుడు గెడం నిరంజన్ తహసీల్దార్‌కు రైతులతో కలిసి సోమవారం కార్యాలయం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అన్ని హక్కులు కల్పించాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం దగ్గరలో ఉందన్నారు. చాలా మంది రైతులు పేదవారు ఉన్నారు. వారికి బ్యాంక్ రుణాలు దొరకాలంటే పహనీలు కావాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం మ్యానువల్ పాహనలు అందించి ఇపుడు ఏమో ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఆలోచించి ఎస్సీలను సహకారం చేయాలని డిమాండ్ చేశారు. వారి వెంట ఎస్సీ, ఎస్టీ నాయకులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా..

పటిష్ఠమైన చర్యలు చేపట్టాలి

- డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు(పర్సనల్) డా.అనిల్‌కుమార్
- పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం

ఆదిలాబాద్ అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోషల్ మీడియాలో జరిగే వాటిని క్షుణంగా పరిశీలిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని డీజీపీ డైరెక్టర్‌జనరల్ ఆఫ్ పోలీసు (పర్సనల్) డా.అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు ముఖ్య కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. జిల్లాకు వచ్చిన ఆయనకు ఎస్పీ అఖిల్ మహాజన్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ముందుగా పోలీసు ముఖ్య కార్యాలయాన్ని పరిశీలించి సిబ్బంది, పోలీసు అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ (పర్సనల్) డాక్టర్ అనిల్‌కుమార్ ఐపీఎస్ మాట్లాడుతూ జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో ఎలాంటి పెండెన్సి లేకుండా కార్యాలయ ఫైల్స్‌ను ఎప్పటి కప్పుడు నవీకరిస్తూ ఉండాలని సూచించారు. హెచ్‌ఆర్‌ఎంఎస్ అప్లికేషన్ ప్రతీ ఒక్క సిబ్బంది పూర్తిస్థాయిలో వినియోగించే విధంగా ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను, గంజాయి మాదక ద్రవ్యాలను పూర్తిగా అరికట్టే విధంగా ఖచ్చితమైన ప్రణాళికను అవలంభించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లాలో జరుగుతున్న, ప్రస్తుతం ఉన్న శాంతి భద్రతల సమస్యలను, ఆదివాసులకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులు, చిల్డ్రన్ పార్కు, తదితర విషయాలను వివరించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడా నికి ప్రత్యేకంగా హైవేలపై రాంబుల్ స్ట్రిప్స్, సూచిక బోర్డులను పెంచడం, ప్రమాద స్థలాలలో జిగ్జాగ్ పద్ధతిని ఉపయోగించడం జరుగుతున్నాయని తెలిపారు. రాత్రి సమయాలలో అనవసరంగా రోడ్లపై తిరగకుండా ఆపరేషన్ చభుత్రను అమలు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ ఐపీఎస్, అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారంశ్రీనివాస్, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



- డీజీపీకి చిత్రపటాన్ని అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



పోలీసు ముఖ్య కార్యాలయాన్ని సందర్శిస్తున్న డీజీపీ(పర్సనల్)

- బాధితుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

ఆదిలాబాద్ అర్బన్: బాధితుల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో పలువురు ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను విన్న జిల్లా ఎస్పీ వాటిని పరిష్కరించే దిశగా సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలను ఇవ్వడం జరిగింది. కాగా జిల్లా నలుమూలల నుంచి ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యక్రమానికి దాదాపు 23 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్‌కవిత, వామన్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సులతో మంచి ఫలితాలు

- ఆర్టీసీ ఎండీ సజ్జనార్
- జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపో, బస్టాండ్ పరిశీలన
- కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎండీ

ఆదిలాబాద్ అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా ఎలక్ట్రిక్ బస్సులను కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్‌లో తీసుకువచ్చామని దానికి స్పందన రావడంతో ఆదిలాబాద్‌కు కూడా త్వరలో ఎలక్ట్రిక్ బస్సులను అందిస్తామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. సోమవారం జిల్లాకు వచ్చిన ఆయన ఆదిలాబాద్ డిపో, బస్టాండ్‌ను సందర్శించారు. మొదటి సారిగా జిల్లాకు వచ్చిన ఆయనకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.అనంతరం డిపో ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కార్మికులను కలిసి పనులు, వారి సమస్యలను అడిగి తెలుసకున్నారు. ఎలాంటి ఇబ్బందులున్న తనకు తెలియజేయాలని సూచించారు. అనంతరం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రయోగాత్మకంగా ఎలక్ట్రిక్ బస్సులను తీసుకువచ్చామన్నారు. అవి మంచి ఫలితాలు ఇవ్వడంతో ఆదిలాబాద్ డిపోకు బస్సులను అందిస్తామన్నారు. అదేవిధంగా డిమాండ్ ఉన్న ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాతక్మంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో మహిళ లు ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణం చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా పేర్కొ న్నారు. ఇంకా సమస్యలున్న అన్ని వాటిని దశల వారీగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోనే ఆదిలాబాద్ డిపో మంచి ఫలితాలు ఇస్తుందని, సిబ్బంది, అధికారులను అభినందించారు.



ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్



కార్మికులతో మాట్లాడుతూ..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సజ్జనార్